# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కొత్త ఢిల్లీలో ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 వేల కోట్ల రూపాయల విలువైన రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులను మరికొద్దిసేపట్లో ప్రారంభించనున్నారు.**
2. **సినిమాలు, టివి సీరియళ్లలో మహిళల పట్ల వివక్షను కట్టడి చేయాల్సిన అవసరముందని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.**
3. **పర్యాటక, చారిత్రాత్మక, వారసత్వ ప్రదేశాల గురించి వివరిస్తూ డిజిటల్ ఫ్లాట్ ఫాం వేదికగా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ పేర్కొంది.**
4. **తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబర్ నెల కోటాను రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి తెలిపింది.**
5. **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర, దక్షిణ కోస్తా ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది.**

==========================

కొత్త ఢిల్లీలో ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 వేల కోట్ల రూపాయల విలువైన రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో రహదారుల అనుసంధానం మెరుగుపరిచడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ట్రాఫిక్ సమస్యను తగ్గించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌లను మరికొద్దిసేపట్లో ప్రారంభించనున్నారు.

--------------------------

సినిమాలు, టివి సీరియళ్లలో మహిళల పట్ల వివక్షను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. లింగ వివక్ష, అవమానకరమైన సంభాషణలను నియంత్రించాలని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవం నిజమైన నాగరిక సమాజానికి పునాది అని తెలిపారు. పిల్లలకు విలువలు నేర్పే విధంగా సినిమాలు, సీరియళ్లు ఉండాలని కోరారు. ఇంట్లో తెరపై చూసేదే వారు నేర్చుకునే అవకాశముందని పేర్కొన్నారు.

--------------------------

ఉమ్మడి అనంతపురం జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులు

రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ ఓబులు తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.. వర్షాల కారణంగా నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని, ఫాగింగ్, ఫ్రై డే – డ్రై డే లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని వెల్లడిస్తూ..

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు యువతకు అవగాహన కల్పిస్తూ, ఈ పోరాటాన్ని 'ప్రజా ఉద్యమం'గా మార్చాల్సిన అవసరంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తూ.. 'జాతీయ మాదక ద్రవ్య రహిత కార్యక్రమాన్ని' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమరవాణాలను అరికట్టడం, నివారణ మార్గాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపడుతోంది. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించడానికి దేశవ్యాప్తంగా నివారణ, చికిత్స, పునరావాసంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం.

---------------------------

ఏలూరు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం జిల్లా ఇన్చార్జి మంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన రేపు మధ్యాహ్నం మూడున్నర గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాలు, గ్రామీణ నీటి సరఫరా పనులు, పౌరసరఫరాలు, స్త్రీ శక్తి పథకం అమలు తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

---------------------------

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబర్ నెల కోటాను రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి తెలిపింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్లు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లను విడుదల చేయనున్నట్లు టిటిడి ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే, ఈ నెల 23న అంగప్రదక్షిణం టోకెన్లు, శ్రీవాణి ట్రస్టు టికెట్లు, అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను, 25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను, అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను ఆన్ లైన్ లో విడుదలచేస్తున్నట్లు తెలిపింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టిటిడి అధికారిక వెబ్ సైట్ ttdevasthanams.ap.gov.in ద్వారానే శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది.

---------------------------

ప్రపంచ స్థాయిలో గుర్తింపుపొందిన రాష్ట్రంలోని పర్యాటక, చారిత్రాత్మక, వారసత్వ ప్రదేశాల గురించి వివరిస్తూ పర్యాటకులను ఆకర్షించేలా డిజిటల్ ఫ్లాట్ ఫాం వేదికగా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ – ఏపీటీడీసీ తెలిపింది. కృష్ణా జిల్లా పెడన కలంకారి ప్రత్యేకత, బాపట్ల జిల్లాలోని ప్రాచీన భట్టిప్రోలు బౌద్ధ స్థూపం, శాసనాల గొప్పతనం, పరిణామ క్రమం, గుంటూరు జిల్లా మంగళగిరి చేనేత వస్త్రాల

విశిష్టత, పానకాల లక్ష్మీ నరసింహస్వామి, ఉండవల్లి గుహల ప్రాశస్త్యం వివరిస్తూ వేరు వేరుగా వీడియోలు రూపొందించినట్లు ఒక ప్రటకనలో పేర్కొంది. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా రూపొందించిన వీడియోలను ప్రతి ఒక్కరూ చూసి లైక్ చేసి, షేర్ చేయాలని కోరింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 20వ తేదీన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సాయంత్రం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి హాజరు కావాలని 14 ఉద్యోగ సంఘాలు, వాటి అనుబంధ సంఘాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆహ్వానించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

---------------------------

విధి నిర్వహణలో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నూజివీడు మున్సిపల్ వర్కర్లు, శానిటేషన్ సిబ్బంది, ఇన్స్పెక్టర్ లను ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి హెచ్చరించారు. పట్టణంలో నిన్న పలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి 30వ వార్డులో మున్సిపల్ వర్కర్లలతో మాట్లాడారు. పట్టణంలో ఎక్కడికి వెళ్లినా పారిశుధ్య సమస్యలపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, సక్రమంగా విధులు నిర్వహించకపోతే విధుల్లోనుంచి తొలగించేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు.

---------------------------

దక్షిణ ఒడిషా, ఉత్తరాంధ్రప్రదేశ్ ప్రాంతాలలో అల్పపీడనానికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం చత్తీస్‌ఘడ్, దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ...

వాయిస్ ..30 సెకన్లు

=====================